మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్/నారాయణపేట




# పాలమూరుకే వలస వచ్చేలా చేస్తాం..

- సేంద్రియానికి సాంకేతికతకు జోడిస్తాం..
- రాష్ట్ర వ్యాప్తంగా పామాయిల్ సాగుచేయాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఇంత గొప్ప సదస్సు గతంలో చూడలేదు : ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ
- రూ.18వేల కోట్లతో రుణమాఫీ చేశాం: మంత్రి జూపల్లి
- అట్టహాసంగా అమిస్తాపూర్ వద్ద రైతు సదస్సు
- వేలాదిగా తరలివచ్చిన రైతులు,ప్రజలు



**మహబూబ్‌నగర్ బ్యూరో, భూత్పూర్, నవంబరు 28, ప్రభాత వార్త:** రానున్న నాలుగు సంవత్సరాలలో రైతుల కోసం ప్రభుత్వం అనుకున్న పనులన్నీ చేసి రైతులతో శభాష్ అనిపించుకుంటుందని, రాష్ట్రవ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. గురువారం ఆయన మహబూబ్నగర్ జిల్లా, అమిస్తాపూర్ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన రైతు పండుగ వ్యవసాయ ప్రదర్శనను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, మహబూబ్‌గర్ జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈరైతు పండుగ వ్యవసాయప్రదర్శనలో ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, ఆహార పదార్థాల ప్రదర్శనపై 117స్టాళ్లు, ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం తోపాటు, సాంకేతికతను జోడించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే విధంగా వ్యవసాయ మెలకువలను అందించడానికి మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన రైతు పండుగ వ్యవసాయ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయ రంగంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డిలాంటి మేధావులు రైతులకు లాభసాటి వ్యవసాయం ఏ విధంగా చేయాలో ఈసదస్సులో అవగాహన కల్పిస్తారన్నారు. చింతల వెంకట్ రెడ్డి గురించి ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఏ పంట వేసినా అత్యధిక దిగుబడి తీయడంలో చింతల వెంకట్ రెడ్డి ఆదర్శంగా ఉంటారని కొనియాడారు. ఇతరదేశాల్లో ఎలాంటి పంటలు పండించి లాభం పొందుతున్నారు, కొత్త పంటలపై రైతులకు మూడు రోజుల సదస్సులో అవగాహన కల్పిస్తారని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదృష్టం కొద్దీ పాలమూరు జిల్లా ముద్దు బిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారని, ఈ జిల్లాను వలసల జిల్లా కాకుండా వలసలు వచ్చే జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నారని తెలియజేశారు. రాబోయే 4 సంవత్సరాల్లో ప్రభుత్వం రూపొందిస్తున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామన్నారు. అత్యంత లాభదాయకమైన పంట పామాయిల్ అని, దీనిని జంతువులు, చీడ పురుగులు నష్టం చేయవని, అందువల్ల పామాయిల్ పంటను రాష్ట్రవ్యాప్తంగా రైతులు సాగు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 117స్టాళ్ళతో ఏర్పాటు చేసిన ఇంత గొప్ప రైతు సదస్సును ఇప్పటివరకు తాను చూడలేదన్నారు. 2003-2004 ప్రాంతంలో వ్యవసాయం దండగ అని ప్రచారం జరిగితే అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమైన ప్రాజెక్టులను ప్రారంభించి కొంతవరకు పూర్తి చేయడం వల్ల వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపించారన్నారు. తర్వాత వచ్చిన ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసినా ప్రస్తుత ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం సాహసోపేత నిర్ణయం తీసుకుంటూ వాటిని సాకారం చేసుకుంటూ ముదుకు పోతుందన్నారు. వ్యవస్థ అనేది శాశ్వతమని పాలించే నాయకుల నిర్ణయాల్లో దార్శనికత, అంకిత భావం ఉండాలని ఆలాంటి నిర్ణయాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవ సాయం ఏవిధంగా చే యాలి, ఆధునిక పద్ధతులు, ఆధునిక వంగడాల పై సాంకేతిక తను మే ధావులచేత రైతులకు అవగాహన కల్పించాల న్నారు. మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన రైతు పండుగలాగ రాష్ట్రంలోని ఉమ్మడి 10జిల్లాలలో ప్రతి సంవత్సరం ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిం చాలని సూచించారు.





● రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ కు అన్నిరంగాల్లో అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన పుడు రూ.70 వేలకోట్లు కంటే తక్కువ రుణభారం ఉండేదని, గడచిన 10సంవత్సరాల కాలంలో ఏకంగా రూ.8లక్షలకోట్లు అప్పుచేసి ప్రభుత్వం అప్ప జెప్పిందని గత ప్రభుత్వం చేసిన అప్పులకు గడచిన పదినెలల్లో సుమారు 60000 కోట్లు వడ్డీ కిందనే చెల్లించడం జరిగిందన్నారు. ఇలాంటి క్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల్లో సైతం ప్రభుత్వం వచ్చాక రైతు రుణమాఫీ చేసిందని తెలిపారు. ఇటీవల 18వేల కోట్లతో రెండులక్షల వరకు ఉన్న రైతురుణాలను ఒకేసారి మాఫీచేయడం జరిగిందన్నారు. సన్న రకం వరిధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు, క్వింటాలు కు 500 రూపాయల అదనంగా బోనస్ చెల్లించడం జరుగు తున్నదని, ధాన్యం అమ్మిన మూడు రోజుల్లో రైతు ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని తెలియజేశారు. రైతులు సేంద్రియ వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడులు తగ్గి లాభాలు పెరుగుతాయని, ఇందుకు సంబంధించి ప్రదర్శనలో స్టాళ్ల అనేకం ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు వాటిని సందర్శించి స్ఫూర్తిని పొందాలని తెలియజేశారు.

● రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నా రెడ్డి మాట్లాడుతూ 2004 కంటే ముందు పాలమూరు జిల్లా లో పరిస్థితులు చాలాదుర్భరంగా ఉండేదని, 2004లో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాలమూ రు జిల్లాలో బీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ వంటి నీటిపారుదల ప్రాజెక్టులను ప్రారంభించి కొంతవరకు పూర్తిచేయడం వల్ల జిల్లాలో సాగునీరు వచ్చిందన్నారు. దానిని కొన సాగించి ఇప్పుడు ప్రాజెక్టులు పూర్తి చేయడంతో పాటు, పాలమూరు-రంగారెడ్డి ఫేజ్2 ప్రారంభించి, కాలువలు అన్ని పూర్తి చేస్తే మరో 10 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జూరాల ప్రాజెక్ట్ పూడికతో నిండిపోయిందని దానివల్ల ప్రస్తుతము 6నుంచి 7టీఎంసీల నీటినిల్వ మాత్రమే ఉంటుందన్నారు. జూరాల పూడిక తీయాలని గత ప్రభుత్వానికి విన్నవిస్తే పెడచెవిన పెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వము త్వరలోనే జూరాలలో పూడిక తీసే కార్యక్రమం చేపడుతుందన్నారు. దానివల్ల16 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. పాలమూరు జిల్లాలో ఇతరరాష్ట్రాల నుండి పాలు దిగుమతి చేసుకోవడం, కూరగాయలు తెప్పించుకోవడం జరుగుతుందన్నారు. ఈ పరిస్థితి మారి ఇక్కడే కూరగాయలు పండించి ఇతర జిల్లాలకు పంపించే విధంగా, అదేవిధంగా జిల్లాలో పాడి పరిశ్రమను ప్రోత్సహించాలని సూచించారు.

● రాష్ట్ర వ్యవసాయ కమిషన్ అధ్యక్షుడు కోదండ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు ఇంకా నెలన్నర రోజుల ముందే మహబూబ్నగర్ జిల్లాలో రైతును రాజు చేయడానికి వ్యవసాయ పండుగ జరుపుకోవడం జరుగుతున్నదని అన్నారు.

### ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

**పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి**

రైతులు సేంద్రియ ఎరువులు వాడి ప్రకృతి వ్యవసాయం చేస్తే లాభదాయకమని, రైతులు ఎవరిపై ఆధారపడవలసిన పనిలేదన్నారు. వ్యవసాయ రంగంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి పిలుపు నిచ్చారు. నవంబర్ 28నుండి 30వ తేదివరకు మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటుచేసిన రైతు పండగ కార్యక్రమానికి గురువారం వెంకట్‌రెడ్డి హాజరై రైతు అవగాహన సదస్సులో ప్రసంగించారు. తన 50 సంవత్సరాల వ్యవసాయ అనుభవాలను రైతులకు విడమరచి చెప్పారు. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల అధిక దిగుబడి వస్తుందని, సేంద్రియ ఎరువులు వాడకం వల్ల తక్కువ దిగుబడి వస్తుందని రైతుల్లో ఉన్నది భ్రమ మాత్రమే అన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటకు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండు ఉందని, తాను పండిస్తున్న వరి ధాన్యం కిలో 150 రూపాయలకు కొనుగోలు చేస్తారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా విటమిన్ ఎ, బి12 వంటి విటమిన్లను జోడించి పంటను సాగు చేయొచ్చన్నారు. మట్టితో మట్టి పురుగు మందు తయారు చేయవచ్చని, ప్రకృతి వ్యవసాయం ఏవిధంగా చేయాలో రైతులకు వివరంగా వివరిస్తానని తెలియజేశారు. నాగర్ కర్నూల్ జిల్లా మహిళా - మిగతా4లో..





రైతు సదస్సులో ఏర్పాటు చేసిన స్టాల్స్






అమిస్తాపూర్‌లో ఏర్పాటైన రైతు సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

---

### సమగ్ర సర్వే ఆన్లైన్ డేటా నమోదులో

## పొరపాట్లకు తావివ్వకండి

- సర్వే పత్రాలను అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలి
- సర్వే ఆన్లైన్ డేటా ఎంట్రీని పరిశీలించిన కలెక్టర్



డేటా ఎంట్రీ వివరాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 28 ప్రభాతవార్త:** సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉపాధి, కులగణన, సమగ్ర సర్వే ఆన్ లైన్ డేటాఎంట్రీలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా ప్రతి కుటుంబ వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం తెలకపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను కలెక్టర్ సునిశితంగా పరిశీలించారు. డేటా ఆపరేటర్లు తప్పులు లేకుండా వివరాలను ఎంట్రీ చేయాలని సూచించారు. తెలకపల్లి మండలంలో 14,891కుటుంబాలకు నిర్వహించిన సర్వేపత్రాలలో, ప్రతిరోజు 1500 సర్వేపత్రాలను ఆన్లైన్ నమోదుచేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు కలెక్టర్‌కు వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డేటా ఎంట్రీ చేసే టప్పుడు ఎన్యుమరేటర్ తప్పనిసరిగా దగ్గర ఉండి నమోదుచేయించాలన్నారు. సర్వే డేటా ఎంట్రీ లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి కుటుంబ వివరాలను క్షుణ్ణంగా, సజావుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డేటా ఆపరేటర్లకు దిశ నిర్దేశం చేశారు. ఈప్రక్రియపై ప్రత్యేకదృష్టి సారించాలని ఎంపీడీవో తాహసిల్దార్లకు సూచించారు. తెలకపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ పూర్తి చేసిన పత్రాలు స్ట్రాంగ్ రూమ్‌లో చాలా జాగ్రతగా బాక్స్‌లో భద్రపరిచిన వాటిని కలెక్టర్ పరిశీలించారు. డేటా ఎంట్రీ పూర్తి అయిన సర్వే పత్రాలను అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలని ఎంపీడీవోను ఆదేశించారు కలెక్టర్ వెంట తెలకపల్లి తహసిల్దార్ జాకిర్ అలీ, తెలకపల్లి ఎంపీడీఓ శ్రీనివాసులు సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

### కేంద్రాలలో సెకరించే ధాన్యానికి

## డబ్బులు చెల్లించే ఏర్పాటు చేయాలి



వరి ధాన్యం కొనుగోలుపై అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, నవంబరు 28 ప్రభాతవార్త :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సేకరించే ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించే విధంగా ఆన్ లైన్ నమోదు ప్రక్రియ ఎప్పటికప్పుడు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో వరి ధాన్యం కొనుగోలు, వాటి చెల్లింపులు విషయమై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 30వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతుల పండుగ కార్యక్రమానికి ముందే ఇప్పటి వరకు సేకరించిన ధాన్యానికి 30వ తేదీలోపు డబ్బులు రైతుల ఖాతాలకు జమ అయ్యేటట్లు ఆన్ లైన్ ప్రక్రియ ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ఆన్ లైన్ నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించేందుకు లారీలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వరి ధాన్యం సేకరణ త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, అడిషనల్ పిడి నర్సింలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

---

## ఆహార నాణ్యతపై తనిఖీలు నిర్వహించాలి : జిల్లా కలెక్టర్



కాన్ఫరెన్స్ హాల్లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, హాజరైన అధికారులు

**వనపర్తి ప్రతినిధి నవంబరు 28 ప్రభాతవార్త :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, హాస్టల్స్ సహా బయట హోటల్స్ లోను ఆహారంలో నాణ్యత ప్రమానాలు పాటిస్తున్నారా లేదా అనే విషయంలో జిల్లా ఆహార భద్రత కమిటీ సభ్యులు తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో ఆహార భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతివారం జిల్లాలో నాలుగు, ఐదు తనిఖీలుచేయాలని సూచించారు. ఎక్కడైనా ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కనిపిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. వసతిగృహాల్లో బియ్యంలో నాణ్యత ఉందా లేదా చెక్ చేయాలని, బియ్యంలో పురుగులు ఏమైనా ఉంటే వెంటనే ఆహార భద్రత కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. వసతిగృహాల్లో స్టోర్ చేసిన ఆహార పదార్థాలు బాగున్నాయా లేదా, ఎక్స్పైరీ డేట్ కలిగి ఉన్నాయా లేదా తనిఖీ చేయాలన్నారు. కేవలం కాలేజీలు, స్కూల్స్ మాత్రమే కాకుండా బయట హోటల్లోనూ ఆహార నాణ్యతను చెక్‌చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, జడ్పీసీఈవో యాదయ్య, డిఎంహెచ్ఓ శ్రీనివాసులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు త్వరిగతిన పూర్తిచేయాలి**

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల నుంచి కొనుగోలుచేసిన ధాన్యానికి రెండురోజుల్లో ట్యాబు ఎంట్రీలు, పేమెంట్లు 90శాతంపూర్తికావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టర్‌ఛాంబర్‌లో పిపిసిలలో వరిధాన్యం కొనుగోళ్లు, పేమెంట్ల విషయంపై అదనపుకలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లుతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏపీఎంలను, పీపీసీలకు పంపి ఈప్రక్రియ వేగవంతం అయ్యేలా సూచనలు ఇవ్వాలని డిఆర్‌డిఓకు ఆదేశించారు. ప్రతి పీపీసీలో ధాన్యం కొనుగోళ్లపై పేమెంట్లు 90శాతం పూర్తికావాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో పేమెంట్లు ఆపే పరిస్థితి లేదని, ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 46వేల722 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందని, కాగా 25 వేల 543 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ. 59.26 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయిందన్నారు. సమావేశంలో డిఆర్‌డిఓ ఉమాదేవి, డిసిఓ ప్రసాదరావు, సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలి



వంట సరుకులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

**నారాయణపేట టౌన్, నవంబరు 28 ప్రభాత వార్త :** విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల( ఆనంద నిలయం), ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా స్థానిక ఎస్సీ ఆనంద నిలయానికి వెళ్లిన కలెక్టర్ అక్కడ విద్యార్థినులకు వడ్డిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించారు. వంట గదిలో నిల్వ ఉంచిన కూరగాయలను చూశారు. అనంతరం డార్మెటరీకి వెళ్లి విద్యార్థినులకు సరిపడా దుప్పట్లు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చివరగా వసతి గృహంలోని మెనూ బోర్డును చూసి గురువారం నాటి అల్పాహారం కిచిడి ఉండగా విద్యార్థినులకు జీరారైస్ వడ్డించిన విషయాన్ని గుర్తించిన కలెక్టర్ అక్కడి సిబ్బందిని ప్రశ్నించారు. మెనూ ప్రకారం కాకుండా వేరే అల్పాహారం ఎలా ఇస్తారని నిలదీశారు. ఇకపై క్రమం తప్పకుండా మెనూ ప్రకారం నాణ్యత తో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. తినడానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థినులకు చెప్పారు. వంట చేసే సిబ్బంది కూడా పరిశుభ్రత పాటించాలని, వంట గది, కూరగాయలు, స్టోర్ గది శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వంట చేసే ముందు కూరగాయలు, బియ్యాన్ని శుభ్రంగా కడగాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ సమీపంలోనే గల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి అక్కడివిద్యార్థులు తింటున్న అల్పాహారాన్ని పరిశీలించి, అల్పాహారం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అయితే బాలుర వసతి గృహంలో మాత్రం కిచిడి ఉండటంతో ఇక్కడ మెనూ ప్రకారం ఇస్తున్నారు ? మరి బాలికల వసతి గృహాల్లో ఎందుకు ఇవ్వలేదని మరోసారి వార్డెన్ను ప్రశ్నించారు. వంటగదికి వెళ్లి సరకుల నాణ్యతను చూశారు. వంట చేసే సిబ్బంది చేతి తొడుగులు, హెడ్ క్యాప్‌లను ధరించి, శుభ్రమైన చేతులతో వంట చేయాలన్నారు. కాగా ఒకరిద్దరు విద్యార్థులు వసతి గృహంలో నీళ్ళు నాలుగు రోజులుగా రావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి నీటిని సరఫరా చేయించాలని అక్కడి వార్డెన్‌ను ఆమె ఆదేశించారు. అలాగే వసతి గృహాలకు బయటి నుంచి తెస్తున్న ప్యూరిఫైడ్ వాటర్ నమూనాలను తీసుకుని పరీక్ష చేయించాలని సూచించారు.

## అభివృద్ధికి పెద్ద పీట

**మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్, నవంబరు 28, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రతి కాలనీలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మహబూబ్ నగర్ పురపాలక పరిధిలోని 6వ వార్డు ( శ్రీనివాసకాలనీ)లో 20.80లక్షలతో నిర్మించిన సిసిరోడ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ అభివృద్ధిఫలాలు అందరికీ అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అనంతరం శ్రీనివాసకాలనీలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అర్చకులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వాదం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడాచైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కౌన్సిలర్లు రాషెద్ ఖాన్, జాజి మొగ్గ నర్సింహులు, తిరుమల వెంకటేష్, ఖాజా పాషా, ప్రశాంత్ , నాయకులు పాల్గొన్నారు.

---

### కుటుంబ సర్వే వివరాలను

## నాణ్యతగా పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**వనపర్తి ప్రతినిధి నవంబరు 28 ప్రభాతవార్త :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి డేటా ఎంట్రీ ప్రక్రియను నాణ్యత, వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ తో కలిసి సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియపై ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే ఫారంలను ఆన్లైన్ డేటా ఎంట్రీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా, నాణ్యతగా డేటా ఎంట్రీ చేయాలని సూచించారు. సర్వే ఫారంలు సూపర్వైజర్ల పర్యవేక్షణ తోనే బయటికి వెళ్లాలన్నారు. ప్రతిరోజు డేటా ఎంట్రీ టార్గెట్ ను పూర్తి చేయాలన్నారు. ప్రతి ఆపరేటర్ రోజుకు 25 ఫారంలు తప్పనిసరిగా ఎంట్రీ చేయాలని సూచించారు. ఫారమ్స్ ను చాలా జాగ్రత్తగా భద్రపరచాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే చేసిన ఫారం లు ఒక్కటి కూడా మిస్ కావద్దని చెప్పారు. అదేవిధంగా సమగ్ర ఇంటింటి సర్వేలో ప్రతి ఒక్క ఇల్లు కవర్ కావాలని, ఏ ఒక్కఇల్లు కూడా సర్వే కాకుండా మిగి లిపోకూడదని ఆదేశించారు. జిల్లాలో ఇంకా కొన్ని ఎన్యుమరేషన్ బ్లాక్ లల్లో కొన్ని ఇల్లు మిగిలిపోయాయని వాటిని కూడా పూర్తి చేయాలన్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లను మళ్లీ విజిట్ చేసి వివరాలు తీసుకొని కవర్ చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పి సీఈవో యాదయ్య, ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాల సందర్శించిన మహిళా కమిషన్ చైర్మన్



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్మన్

**మాగనూరు, నవంబరు 28 ప్రభాతవార్త :** మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నెలకొన్న మధ్యాహ్న భోజనం విషయంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద గురువారం మధ్యాహ్నం సందర్శించారు. మధ్యాహ్న భోజనం కలుషితమైన విషయమై ఉపాధ్యాయులతో మాట్లాడారు. వారంరోజుల వ్యవధిలో మూడుసార్లు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనడంపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన విషయంలో వంట ఏజెన్సీ మహిళలు బియ్యం శుభ్రం చేయకపోవడం వల్లనే అస్వస్థకు గురైనట్లు విద్యార్థులు ఆమెకు వివరించారు. అంతకుముందు భోజనానికి సంబంధించిన బియ్యం పరిశీలించారు. గురువారం వంటచేసిన వారితో మాట్లాడారు భోజనానికి తెచ్చిన బియ్యం బాగున్నాయని అంతే బాగా విద్యార్థులకు వండి వడ్డించాలని సూచించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులతో - మిగతా4లో..

## సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేయరాదు: జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్


జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేటటౌన్,నవంబరు28 ప్రభాతవార్త :** నారాయ ణపేట జిల్లాపరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం మరియు ఇతరుల మనోభావా లు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.జిల్లా ఎస్పీయోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాజకీయంగాను, కుల,మత, ప్రాంతీ యంగాను ప్రజల భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిం చేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు. సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్బుక్,ట్విట్టర్ ఇంస్టాగ్రామ్, వాట్సప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న, తమకు తెలియని వీడియోలు, ఫోటోలు పోస్టులు చేసిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్‌ని బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయి అని తెలిపారు. సామాజిక మధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్లపైన ప్రత్యేకంగ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. జిల్లాలో ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిని అనుక్షణం పోలీసులు గమనిస్తూ ఉండాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది కావున ఈ తరహా నేరలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకొని అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు నిరంతరం 24/7 పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్పీ సూచించారు.

## విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకే జన విజ్ఞాన వేదిక : అదనపు కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి నవంబరు 28 ప్రభాతవార్త :** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకే జన విజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టులు దోహదపడతాయని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో చెకుముకి సంబరాలు 2024 కార్యక్రమం నిర్వహించగా అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చెకుముకి సంబరాలు 2024 క్వశ్చన్ బుక్ లెట్ ను ఆవిష్కరించారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకే జన విజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టులు దోహదపడతాయన్నారు. ప్రజలను చైతన్యం చేయడంలో జన విజ్ఞాన వేదిక ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


క్వశ్చన్ బుక్ లెట్ ను ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

## ఆర్యవైశ్య మహిళల కార్తీకమాసం వనభోజనాలు

**దేవరకద్ర,నవంబరు 28 ప్రభాతవార్త :** దేవరకద్రకు చెందిన ఆర్యవైశ్య మహిళలు కార్తీక మాసాన్ని పురస్కరించుకొని గురువారం వనభోజనాలకు బయలుదేరి వెళ్లారు.ప్రతి ఏడాది ఆర్యవైశ్య మహిళలు కార్తీక మాసంలో జిల్లాలోని ఆయా దేవాలయాలకు వెళ్లి పూజలు చేసి వనభోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈఏడాది కూడా కార్తీకమాసాన్ని పురస్కరిం చుకొని స్థానిక ఆర్యవైశ్య మహిళలు ఆయా దేవాలయాలలో పూజలు చేసి వాన భోజనాలు చేయడానికి బయలుదేరి వెళ్లారు.ఈసందర్భంగా తంగిడి తోపాటు మాధ్వార్,ఇడ్లూర్, నారాయణపేట మరియు గుహ ప్రాంతాల్లో ఉన్న ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ వనభోజనాలు చేశారు. కార్తీక దీపాలను ఆయా నదుల్లో వదిలారు. ఈ కార్యక్రమంలో దేవరకద్రకు చెందిన ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


దేవాలయంలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

## ప్రజా విజయోత్సవ అవగాహన సభకు రైతులు

**రాజాపూర్, నవంబరు 28 ప్రభాతవార్త :** మండల కేంద్రం నుండి ప్రజా విజయోత్సవ సభకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య ఆధ్వర్యంలో బయలుదేరిన రైతులు. ప్రభుత్వ ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 30న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతుల కార్యక్రమం బహిరంగ సభలా కాకుండా వారికి అవగాహన కల్పించే రైతు సదస్సుగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని కాంగ్రెస్ పార్టీ రాజాపూర్ మండల అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య యాదవ్ అన్నారు. ఈ విజయోత్సవ సభలో రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, మెళకువలపై అవగాహన కల్పించే లక్ష్యంగా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం రాజాపూర్ మండలం నుంచి పలువురు రైతులను ఈ రైతు అవగాహన సదస్సుకు తీసుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్ రెడ్డి, ఖానాపూర్ శేఖర్ గౌడ్, గోనెల రమేష్, నజీర్ బేగ్, మల్లెపల్లి అశోక్, శ్యాంసుందర్ రెడ్డి, ఖానాపూర్ మైపాల్ రెడ్డి, కుమ్మరి వెంకటయ్య, వెంకటయ్య, మల్లేష్, చెన్నయ్య, వ్యవసాయ శాఖ అధికారులు, పలువురు రైతులు ఉన్నారు.


విజయోత్సవ సభకు తరలిన రైతులు

## షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం

**ధన్వాడ, నవంబరు 28 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రానికి అనుకోని ఉన్న భాగ్యలక్ష్మి కాటన్ మిల్లులో షార్ట్ సర్క్యూట్ ద్వారా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ అగ్ని ప్రమాదంలో గత కొన్ని రోజులుగా కొనుగోలు చేసిన సుమారు పదివేల క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్టు యజమాని తెలిపాడు. దీని విలువ సుమారు రూ. 7 కోట్ల వరకు ఉంటుందని అగ్ని ప్రమాదం వలన రైతులకు సంబంధించిన పత్తి దగ్ధం కాలేదని యాజమాన్యం కొనుగోలు చేసిన పత్తి దగ్ధమైందని ఆయన తెలిపారు. గత సంవత్సరం కూడా ఈ కాటన్ మిల్ లో ఇదే తరహా అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిప్రమాదం సమాచారం అందిన వెంటనే నారాయణపేట ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారని తెలిపారు.

## దీక్షా దివాస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**భారాస పార్టీ జిల్లా నాయకులు షేక్ జహంగీర్**

**వనపర్తి టౌన్, నవంబరు 28 ప్రభాతవార్త:** కేసిఆర్ 14ఎఫ్ రద్దుతో పాటు ప్రత్యేక తెలంగాణ కోసం ఆమరణ దీక్ష చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ప్రకటనకు నాంది పలికిన నవంబర్ 29 రోజున ఆమరణ దీక్షను ఖిదీక్షా దివాస్‌ఖి అని నామకరణం చేయడం జరిగిందనీ దీక్షా దివాస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భారాస పార్టీ జిల్లా నాయకులు షేక్ జహంగీర్ గురువారం పిలుపునిచ్చారు. భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలమేరకు వనపర్తి జిల్లా భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం దీక్ష దివాస్ కార్యక్రమం జరగనుందని ఆయన తెలిపారు. జిల్లా దీక్షా దివాస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఇంచార్జి మాజీ జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డితో పాటు మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, వనపర్తి జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్ పాల్గొంటారని జహంగీర్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున వనపర్తి జిల్లా భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, దీక్షా దివాస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## రాజనగరంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**వనపర్తిటౌన్,నవంబరు 28 ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోనీ 12 వార్డు రాజనగరంలో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితుల కుటుంబాలకు కాంగ్రెస్ శ్రేణులు పంపిణీ చేశారు. వనపర్తి రాజనగరం చెందిన జి పెంటయ్య, పి లక్ష్మిలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.వారు ఈసందర్భంగా మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఆర్థికంగా మనో ధైర్యాన్ని కలగజేస్తాయని వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను రాజనగరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమక్షంలో బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.లబ్ధిదారులు ఎమ్మెల్యే తూడిమేఘా రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీఅధ్యక్షులు కొత్తగొల్ల శీను,పెండెం కురుమూర్తి ఆటో, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ సారగుండ్ల (మాల) మన్యం, గొడుగు సత్యనారాయణ, వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అంబటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటి సర్వేలో తప్పులు దొర్లవద్దు : జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, నవంబరు 28 ప్రభాతవార్త :** అన్ని వర్గాల ప్రజల సామాజిక,ఆర్థిక స్థితిగతులపై విశ్లేషణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే వివరాలను, ఆన్‌లైన్ డేటా ఎంట్రీని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంటింటి సర్వే, ఆన్ లైన్ నమోదు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వే డేటా ఎంట్రీని ఆపరేటర్లు తప్పులు దొర్లకుండా నిర్వహించేందుకు ఎనుమరేటర్లు తప్పనిసరిగా వారి దగ్గర ఉండి నమోదు చేయించాలని అన్నారు. అవసరమైతే అదనంగా ఆపరేటర్ల సంఖ్యను పెంచుకొని కంప్యూటర్లు, ల్యాప్ ట్యాప్ లు, ట్యాబ్ లతో ప్రతిరోజు సాయంత్రం పారదర్శకంగా పనులు చేపట్టాలన్నారు. డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం, గ్రామీణ ప్రాంతాలలో వలసలు వంటి కారణాలవల్ల అసంపూర్తిగా ఉన్న సర్వేను పూర్తి చేసేందుకు వారి ఫోన్ నెంబర్లు సేకరించి కాల్ చేసి వివరాలు సేకరించి పూర్తి చేయాలన్నారు. నిర్దిష్ట సమయంలో సర్వే నమోదు పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, జడ్పీ సీఈఓ కాంతమ్మ, డిపిఓ శ్యామ్ సుందర్, ఎంపీడీవోలు, ఏపీఓ లు, ఏపీయం లు తదితరులు పాల్గొన్నారు.





ఇంటింటి సర్వే పై అధికారులతో సమీక్ష జరుపుతున్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు లక్ష్మి నారాయణ,నర్సింగరావు పాల్గొన్న అధికారులు

## రోడ్డు ప్రమాదాలను అరికడుదాం : జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**కొత్తకోట నవంబరు 28 ప్రభాతవార్త :** రోడ్ ప్రమాదాలను అరికట్టెందుకు తగిన చర్యలు తీసుకుందామని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం కొత్తకోట పట్టణ కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రోడ్డు సేఫ్టీపై యువకులకు, వాహన డ్రైవర్లుకు, వాహన యజమానులకు అవగాహన కార్యక్రమం హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ దీపతో కలిసి ప్రారంభించారు. ముందుగా ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌ను ఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ నిత్యం రోడ్డు ప్రమాదాలు సర్వసాధారణమైపోయావని, గత జనవరి నుండి నేటి వరకు ఒక్క కొత్త కోట పోలీసు స్టేషన్ పరిధిలోనే సుమారు 126 ప్రమాదాలు జరిగాయని చెప్పుటకు ఎంతో బాధగా వుందన్నారు. దీని వల్ల నూట ఇరవై ఆరు కుటుంబాలపై ప్రభావం వుంటుందనే విషయం కలిచి వేసిందని, దీని నివారణ కోసం హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో ఒక కార్యచరణలో భాగంగా, ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరు స్వాగతించాలని పేర్కొన్నారు. మైనర్ యువకులకు వాహనాలను ఇవ్వొద్దని వాటి వల్ల అనేక ప్రమాదాలు జరుగుతాయని పేర్కొన్నారు. అదేవిదంగా గుండె నొప్పి వచ్చిన వారికీ సీపీయర్ ఏ విధంగా చేయాలనే అంశంపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్సై మంజునాథ్ రెడ్డి, పెద్దమందడి, పెబ్బేరు ఎస్సైలు, నేషనల్ హై వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీపీయర్ పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## తాగునీటి పైపుల లీకేజీకి పాల్పడితే చర్యలు తప్పవు

**తాగునీరు టెస్ట్ చేసిన తర్వాతనే గ్రామాలకు వదలాలి : ఆర్‌బ్ల్యూఎస్ ఎస్సీవెంకటరమణ**

**వీపనగండ్ల నవంబరు 28 ప్రభాతవార్త :** గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా ఏర్పాటు చేసినటువంటి త్రాగునీటి పైపులైన్లను ఎవరైనా ఇంటి యజమానులు తీసివేయడం వాటిని తొలగించడం చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ వెంకటరమణ హెచ్చరించారు. గురువారం నాడు వీపనగండ్ల మండల కేంద్రానికి వచ్చి గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా ఆయన పరిశీలించారు అధికారుల అనుమతి లేకుండా ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు తాగునీటికి అమర్చిన పైపులను తీసి వారి ఇష్టమొచ్చినట్లు మళ్లీ ఫిటింగ్ చేసుకోవడం జరుగుతుందని అలాంటి సందర్భంలో సరిగ్గా ఆ పైపులు సెట్ కాక గ్రామాల్లోనికి వదిలినటువంటి నీళ్లు రోడ్లపై ప్రవహించి మురుగునీరుగా మారుతున్నాయని అలాంటి వాటికి ఆయా గ్రామాలలోని ప్రజలే కారణం అవుతున్నారని ఆయన అన్నారు ఒకవేళ పైపులైను లీకేజీలు జరుగుతే ఆర్డబ్ల్యూఎస్ సిబ్బందికి తెలియజేయాలని గ్రామీణ ప్రాంతంలో ఉన్న మా సిబ్బందికి చెలియా చేస్తే తక్షణమే మరమ్మతులు చేపట్టి నీరు లీకేజీ కాకుండా జాగ్రత్త పడతారని ఆయన ప్రజలకు సూచించారు ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు అదేవిధంగా గోపాలదిన్నె త్రాగునీటి ఫిల్టర్ బెడ్స్ దగ్గరికి వెళ్లి అక్కడి తాగునీటిని కూడా పరిశీలించి ఏమైనా ఇబ్బందికరంగా తాగునీటి సమస్య ఉన్నదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సురక్షితమైనటువంటి త్రాగునీరు అందించాలని గ్రామాలలో ఎలాంటి ఇబ్బంది కాకుండా ప్రజల ద్వారా ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సిబ్బందికి ఆయన సూచించారు త్రాగునీరు వదిలేటప్పుడు నీటిని పరిశుభ్రంగా ఉన్నదా లేదా అని టెస్ట్ చేసిన తర్వాతనే గ్రామాలకు వదిలారని ఆయన సూచించారు ఈయన వెంట డిఈ అమిట్ ,ఏ ఈ విశ్వనాథ్ యాదవ్ తో పాటు గ్రామ సిబ్బంది ఉన్నారు.


లీకేజీ పైపులను పరిశీలిస్తున్న ఎస్సీ వెంకటరమణ

## ఆహార కమిటీ సభ్యులు తిన్నాకే విద్యార్థులకు భోజనం వడ్డించాలి

**జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి నవంబరు 18 ప్రభాతవార్త :** వసతి గృహాలలో ఆహార కమిటీ సభ్యులు తిన్నాకే విద్యార్థులకు భోజనం వడ్డించాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం ఉదయం గోపాల్ పేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల, బాలుర వసతి గృహాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి వసతి గృహ సంక్షేమ అధికారి, ఆహార కమిటీ సభ్యులు తిన్నాకే విద్యార్థులకు భోజనం వడ్డించేల చర్యలు తీసుకోవాలని అన్నారు. వసతి గృహాలకు సరఫరా అయ్యే బియ్యం,కూరగాయలు ఇతర సరుకుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దు అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని భోజనానికి ముందు తర్వాత సబ్బుతో చేతులు కడుకోవాలని వసతి గృహ ఆవరణ పరిసర ప్రాంతాలు పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు త్రాగడానికి వంట చేయడానికి ఫిల్టర్ నీటిని మాత్రమే ఉపయోగించాలని వంటగది ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని వసతి గృహ సిబ్బందికి సూచించారు. స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని వాటిలో ఆహార కమిటీ సభ్యులు సంతకాలు ఉండాలని ఆదేశించారు. రిజిస్టర్ నిర్వహణ సరిగా లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఆహార నాణ్యత బాధ్యతా వసతి గృహ సంక్షేమ అధికారులదే అని తేడ వస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు ఎం. జీవిత, ఏస్. రమేష్ గౌడ్ వసతి గృహ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు వడ్డిస్తున్నా ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి

## వికలాంగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**అమరచింత నవంబరు 28 ప్రభాతవార్త :** వికలాంగులకు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో గురువారం అమరచింత మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు ప్రభు స్వామి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ లక్ష్మణ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో వికలాంగులకు రూ.6000 పెన్షన్ ఇస్తామని వాగ్దానం చేసిన తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని వారు అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వికలాంగులకు ఇచ్చిన హామీ రూ.6000 పెన్షన్ ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే గత ప్రభుత్వం 2014లో ఆసరా పెన్షన్ మంజూరు కోసం ఆదయపరమేటి విధిస్తూ జీవో నెంబర్ 17ను అమలు చేసిందని పెన్షన్ దారులకు నష్టం కలిగే జీఓను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ లో ఉన్న 24 లక్షల 84 వేల మంది పెన్షన్ దారులు దరఖాస్తులు చేసుకు న్నారని హరులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న ఉద్యోగాలలో వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు ఇవ్వాలని అలాగే ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఎన్జీరా మహిళా శక్తి క్యాంటీన్లలో వికలాంగులకు ఐదు శాతం కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ నుండి డిసెంబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఆందోళన చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య ఆచారి ప్రభు దాస్ ఘట్టన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు వినతిపత్రం

## బీడీ కార్మికులకు రూ.4016 భృతి ఇవ్వాలి

**చిన్నచింతకుంట, నవంబరు 28 ప్రభాతవార్త:** బీడీ కార్మికులకు రూ.4016 కార్మిక భృతి ఇవ్వాలని టిఎఫ్‌టియు అనుబంధ సంఘమైన తెలంగాణ బీడీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 30న జిల్లాకు వస్తున్న రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించుకున్నామని. అందుకు అనుమతి కోరుతూ జిల్లా ఎస్పీ కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. పోలీస్ శాఖ నుండి సానుకూలంగా నిర్ణయం వస్తుందని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.మా యూనియన్ నుండి ముఖ్యమంత్రి కి చేస్తున్న విజ్ఞప్తి బీడీ పరిశ్రమపై ఆధారపడ్డ కార్మికులందరికీ కూడా కార్మిక భృతి చెల్లించాలని, జిల్లాలో సుమారు పదివేల మంది బీడీ కార్మికులు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని వీరికి అనారోగ్య సమస్యలు ఏర్పడితే ప్రవేట్ హాస్పిటల్ పై ఆధారపడే పరిస్థితి ఉంది . మండల కేంద్రంలో 100 పడకల సూపర్ స్పెషాలిటీ కార్మిక హాస్పిటల్ నిర్మించాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు.పీఎఫ్ లో టెక్నికల్ సమస్యలు పరిష్కరించి కార్మికులు పీఎఫ్ లో జమ చేసిన డబ్బులు కార్మికులకు అదే విధంగా చూడాలని,పని మానేసిన కార్మికులకు, చనిపోయిన కార్మిక కుటుంబాలకు చట్టప్రకారం గ్రాటివిటీ ఇచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. బీడీ కార్మికులందరికీ 150 గజాల ఇంటి స్థలం మంజూరు చేసి ఇల్లు నిర్మించుకోవడానికి రూ. 5 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కార్మికుల ఈ న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళుటకు సహకరించాలనికోరారు.ఈ సమావేశంలో సంఘం నాయకులు బొజ్జన్న, బాబు, డానియల్ ,చెన్నప్పలు ఉన్నారు.


విలేఖరులతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు

## దీక్ష దివాస్‌ను విజయవంతం చేయండి

**బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు**

**ఉప్పునుంతల,నవంబరు 28 ప్రభాతవార్త:** నేడు శుక్రవారం 29న జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే దీక్ష దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొత్త రవీందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు అవుతారని ఆయన తెలిపారు. కావున మండల వ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## భాదితులకి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**పెబ్బేరు నవంబరు 28 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణం లో 4 వ వార్డ్ కి చెందిన నటువంటి శ్వేతకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి యువ నాయకుడు శివకుమార్ ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమక్షంలో బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 4వవార్డ్ ఇంచార్జ్ శివకుమార్,సీనియర్‌నాయకులు యుగేందర్‌రెడ్డి,మాజీ డైరెక్టర్ రాములు,యువజన కాంగ్రెస్ అభ్యర్థి రాజేష్ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులు ఎంపిక

**చిన్న చింతకుంట, నవంబరు 28 ప్రభాతవార్త :** మండలంలోని అల్లిపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో పాల్గొన క్రీడాకారులు అశ్విని (50మీ),సుచిత్ర (బ్రాడ్‌జంప్), గణేష్ (జావీలెన్ త్రో), అక్షయ (300మీ),బి.సింధుజ (100మీ) విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించారు. డిసెంబర్ 1న మంచిర్యాల జిల్లాలో జరగబోయే 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పర్వీన్, విద్యార్థుల తల్లితండ్రులు, గ్రామస్థులు, రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు అథ్లెటిక్స్ పోటీలలో రాష్ట్ర జాతీయస్థాయిలో రాణించి మరెన్నో విజయాలు సాధించి గ్రామనికి, జిల్లాకు, రాష్టానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామస్తులు కోరారు.



## దీక్షా దివాస్‌ను విజయవంతం చేయండి

**కోయిలకొండ, నవంబరు 28 ప్రభాతవార్త :** నేడు నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించబడుతున్న దీక్ష దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, కోయిలకొండ గ్రామం మాజీ సర్పంచ్ బి కృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కోయిలకొండ మండలం నుంచి టిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇట్టి కార్యక్రమం పేట పట్టణంలోని సింగారం చౌరస్తా లో నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఘన సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్,నవంబరు28 ప్రభాతవార్త:** ఇటీవల సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలలో నారాయణపేట జిల్లా తరపున కృష్ణ మండలం ముడుమాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశాలి, శిరీష, కావేరి, నవిత, అర్చన, అరవింద్ పాల్గొని క్రీడా నైపుణ్యతను ప్రదర్శించారు. వీరిలో కే. అర్చన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, విశ్రాంత పీఈటి బి.గోపాలం, పాఠశాల జిహెచ్‌ఎం నిజాముద్దీన్ వారికి ప్రశంసా పత్రాలు అందజేసి శాలువలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల విద్యార్థిని కే. అర్చన డిసెంబర్ 25 నుండి 30 వరకు పశ్చిమ బెంగాల్ రాజధాని కలకత్తాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో పిఈటి మీనా కుమారి, ఉపాధ్యాయులు కురుమయ్య, జనార్ధన్ రెడ్డి, శ్రీనివాస్, మాధవి, రమేష్, గాయత్రి, తిమ్మప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు సదస్సులో స్టాల్స్‌ను ప్రారంభించిన వనపర్తి ఎమ్మెల్యే



**వనపర్తి ప్రతినిధి నవంబరు 28 ప్రభాతవార్త :** ఈనెల 30వ తేదీన ప్రజా పాలన విజయోత్స వాల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త రైతు పండగ ఉత్సవాల సందర్భంగా గురువారం ఏర్పాటుచేసిన రైతుసదస్సులో రాష్ట్ర వ్యవసా యశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలు ఏర్పాటుచేసిన స్టాల్స్ ను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభిం చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రైతు సదస్సులో పలు కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ల ద్వారా అన్నదాతలకు, మహిళా సంఘం సభ్యులకు, నిరుద్యోగ యువతకు, చిన్న తరహా పరిశ్రమల ఏర్పా టు చేయాలనుకునే వారికి తగిన ప్రోత్సాహకం అందిస్తారని ఆసక్తి గలవారు స్టాల్స్ ను సందర్శించి వారివారి వివరాలను నమోదు చేయించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు అధికారులు, వివిధ కంపెనీల యాజమాన్యం, బ్యాంకుల అధికారులు, ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలి



**వంగూరు, నవంబరు28 ప్రభాతవార్త:** వంగూరు రైతులు పండించిన వరి ధాన్యా న్ని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి ద్వారా నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని విక్రయించాలని జిల్లా డిఆర్‌డిఓ ఓబులేష్ తెలిపారు. గురు వారం వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో ఐకెపి ద్వార ఏర్పాటు చేసిన వరిధాన్యం కేంద్రాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఓబులేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులు పండించిన ధాన్యాన్ని రూ.500 బోనస్ పొందాలని సూచిం చారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. రైతుల శ్రేయస్ కోసం ప్రభుత్వం రైతు పండించిన ప్రతి గింజలు కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరను కల్పించి కొనుగోలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కొండారెడ్డిపల్లి స్పెషల్ ఆఫీసర్ డా.జీవీ రమేష్, ఏపీఎం చంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

## సోషల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాల హాస్టల్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**కల్వకుర్తి, నవంబర్ 28, ప్రభాతవార్త:** వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలు వంటకాలు వాడుతూ నాణ్యమైన భోజనం అందిం చాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ సీతారామ రావు సూచించారు. కల్వకుర్తి పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాల వసతి గృహాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహ పరిసరాలను పరిశీలించారు, వంటగది, వంట సరుకులను, కూరగా యలను పరిశీలించారు. ఆనంతరం వసతి గృహ వార్డెన్, ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. వేడివేడి వంటకాలను విద్యార్థులకు అందించాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసారు. అయన వెంట ఆర్డీవో శీను, తహశీల్దార్ ఇబ్రాహీం, డిఎస్ఓ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## పథకాలపై గ్రామాలలో కళాకారులు విస్తృత ప్రచారం

**ఇటిక్యాల, నవంబరు 28 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వంలో ప్రజా పాలన కార్యక్రమం ద్వారా 6గ్యారెంటీ పథకాలు అమలుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రజా విజయోత్సవాల పాలనపై ప్రజలకు అట పాటల ద్వారా అవగాహన కల్పించారు. గురువారం జిల్లా కలెక్టర్ బి .ఎం సంతోష్ ఆదేశాలతో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి అరిఫ్‌యుద్దీన్ సారథ్యంలో మండల తహసీల్దార్ బి.నరేందర్, డిప్యూటీ తహసీల్దార్ నందిని, ఆర్ఐ బీమ్‌సేన్‌రావు అధ్యర్యంలో గద్వాల జిల్లా సాంస్కృతిక సారధి అధ్యక్షులు రాహుల్ కళా బృందంచే మండల కేంద్రం ఇటిక్యాల, ఉదండాపురం, షాబాద్ గ్రామాలలో కళాజాత బృందం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన నాటి నుండి ఏడాది కాలంలో అమలు చేసిన 6గ్యారంటీ పథకాలపై ఈనెల 19 నుండి డిసెంబర్ 7వరకు 19 రోజులపాటు జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తుండగా అందులో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన 6 గ్యారెంటీలలో మహిళలకు ఆర్టీసీలో ఫ్రీ బస్సు ప్రయాణం, 500 రూపాయలకు సిలిండర్, పంపిణీ. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరా మహిళా శక్తి, 50 వేల ఉద్యోగాల నియామకం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు తదితర పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాకారులు భూపతి రమాదేవి, హజ్రత్, కృష్ణ స్వామి, కవిత, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ పోస్టర్ విడుదల

**చిన్నంబావి, నవంబరు 28 ప్రభాతవార్త:** డిసెంబరు ఒకటిన నిర్వహించే మాలల సింహ గర్జన మహాసభను జయప్రదం చేయాలని జాతీయ మాల మహానాడు ప్రధాన కార్యదర్శి తలారి కాశన్న పిలుపునిచ్చారు. గురువారం చిన్నంబావి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో మాలలు అత్యధిక సంఖ్యలో ఉన్నారని, మాలలను కించపరుస్తూ మంద కృష్ణ మాదిగ చేసే వ్యాఖ్యలు సబబు కాదని మను వాదులు మాలలు కాదని, మాదిగలే మనువాదుల అవతారం ఎత్తి మాలలపై విష ప్రచారం కొనసాగిస్తున్నారని జాతీయ మాల మహానాడు ప్రధాన కార్యదర్శి తలారి కాశన్న అన్నారు. డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహ గర్జన మహాసభను రాష్ట్రంలో మాలలు అందరూ విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. గత 30ఏళ్లుగా మాలలను దుమ్మెత్తి పోస్తూ చిన్నచూపు చూశారని, మాదిగ సమాజానికి మాలలు అండగా నిలబడి అనేక పోరాటాలు చేశారని ఆయన గుర్తు చేశారు. ఏబిసిడి వర్గీకరణతో దళిత జాతి ఇచ్ఛినమవుతుందని ఐక్య ఉద్యమాలతోనే హక్కులు సాధ్యమవుతుందని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్ మాల, తలారి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## మదనపూర్ గురుకుల పాఠశాల విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

**వనపర్తి క్రైమ్ నవంబరు 28 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా మదనపూర్ గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ప్రవీణ్ అనే విద్యార్థి మృతిపై గురువారం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభిని విద్యార్థి సంఘాల నేతలు కలసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాలనేతలు మాట్లాడుతూ...పాఠశాలలో బుధవారం ఉదయం అనుమా నాస్పదంగా విద్యార్థి చనిపోయాడు. కానీ పాఠశాల సిబ్బంది విద్యార్థి ఉరేసుకొని చనిపోయాడని నిర్ధారించారు. కానీ విద్యార్థి మృతి పట్ల అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థి మృతి పై కలెక్టర్ ఆధీనంలో సమగ్రమైన విచారణ జరిపించి మృతికి కారకులైన అధికారులను తక్షణమే విధుల నుండి తొలగించాలని, విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం తరఫున 20 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరారు. వనపర్తి జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో, గురుకులాలు, హాస్టల్స్ లో తీవ్రమైన సమస్యలతోకొనసాగుతున్నాయి. వీటికి కారణంపై అధికారులు సకాలంలో పర్యవేక్షణ చేయకపోవడం ఒకవేళ చేసిన నామమాత్రంగా చేసి రావడం జరుగుతుంది. కావున అధికారులు తప్పనిసరిగా వారానికి ఒకసారి బస చేసి విధంగా ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.ఆది, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. పవన్ కుమార్, జీవీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ నాయక్, పి డి ఎస్ యు నాయకులు గణేష్, ఎమ్మెస్ఎఫ్ నాయకులు పరుశురాం, బిజివిఎస్ నాయకులు శివనాయక్, బిఎస్ఎఫ్ నాయకులు రాము, ఎస్ఎఫ్ఐ జిల్లానాయకులు మొగిలి, కుమార్, నీలోత్పల్, పిడిఎస్‌యు నాయకులుగోపి పాల్గొన్నారు.

## జోగులాంబ గద్వాల జిల్లా సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎన్నిక

◆ కబడ్డీ శారీరక, మానసిక సమన్వయ క్రీడా ◆ కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డీకే స్నిగ్ధరెడ్డి

**గద్వాల నవంబరు28 ప్రభాతవార్త:** కబడ్డీ క్రీడా శారీరక, మానసిక సమన్వయానికి సంబంధించిన క్రీడా అని కబడ్డీ చైర్మన్ డీకే స్నిగ్ధ రెడ్డి అన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అడహక్ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా సీనియర్ మహిళా కబడ్డీ సెలక్షన్ ట్రయల్స్ ను గురువారం గద్వాలలోని తేరుమైదానం గద్వాల యందు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కన్వీనర్ అబ్రహం జిల్లా అడహక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అడహక్ కబడ్డీ అసోసియేషన్ ఛైర్మెన్ స్నిగ్ధరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా డికె. స్నిగ్ధారెడ్డి మాట్లాడుతూ ...కబడ్డీ క్రీడా అనేది శారీరక, మానసిక సమన్వయానికి సంబంధిం చిన క్రీడా అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాకు జాతీయ స్థాయిలో పేరు తీసుకు వచ్చిన క్రీడాకారిణిలు మన దగ్గర ఉండడం మనకు గర్వకారణం అన్నారు. ఇప్పుడు జరగబోయే సెలక్షన్ ట్రయల్స్‌లో చక్కటి ప్రదర్శనను కనబరిచి రాష్ట్రస్థాయిలో మన జిల్లా కు పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కృష్ణవేణి రామాంజనే యులు, బండల పద్మావతి వెంకట్రాములు, ఫుట్బాల్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్ ,కౌన్సిలర్ బండల పాండు, పిడి నగేష్, రాజారెడ్డి, జిల్లా అడహక్ కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తిరుపతి, రజినీ కాంత్, సర్వేశ్వర్ రెడ్డి, కొత్త సురేష్, రాజశేఖర్, మంజునాథ్ గారు, పి ఈటీలు రాధ, రేష్మ, శాంతి, మోహన్ బాబు, దౌదర్పల్లి రాము, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు, మహిళా క్రీడాకారిణిలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే లక్ష్యంగా సర్కార్ ముందుకు..

◆ అంబరాన్ని అంటేలా సంబారాలు చేద్దాం

◆ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, నవంబరు 28 ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ సర్కార్ ముందుకు సాగు తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైన సంద ర్భంగా రాష్ట వ్యాప్తంగా అంబరాన్ని అంటేలా సంబారాలు చేద్దామని ఎమ్మెల్యే కసిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28,29,30 తేదీల్లో మహ బూబ్‌నగర్‌లోని అమిస్తాపూరులో లక్షల మందితో రైతు పండుగను కన్నుల పండుగగా చేపడుతామన్నారు. రైతును రాజు చేయాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. రాష్ట వ్యాప్తంగా రైతు పండగకు అన్ని ఏర్పాటు చేశా మని, ముగింపు ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదరరాజనర్సింహలు హాజరవుతారుని అన్నారు. అసంబద్ధ మాటలతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులను రెచ్చ గొడుతున్నారని ఎద్దేవా చేశారు. అప్పుల పాలైన తెలంగాణను గాడిలో పెడుతున్నామన్నారు. రైతులకు సబ్సిడీపై వేల సెట్ల స్పింక్లర్లు పంపిణీ చేస్తామని ఎంఎల్ఏ తెలిపారు. దేశ వ్యాప్తంగా భారీ ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్ పార్టీనే అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. కేసీఆర్ హయం రైతులకు మోసం జరిగిందన్నారు. రూ.2లక్షల రుణ మాఫీ ఏకాలంలో చేశామని అన్నారు. 18 వేల కోట్లతో రుణ మాఫీ చేశామని అన్నారు. సాంకేతిక కారణాల వలన కొత్త మందికి రైతులకు రుణాలు రాలేదని త్వరలో అందరికీ రుణ మాఫీ చేస్తామని చెప్పారు. రూ.2లక్షల లోపు రుణమాఫీకి సర్కారు కట్టుబడి ఉందని, రైతులను మోసం చేసింది బీఆర్ఎస్ పార్టీనే అన్నారు. 7లక్షల కోట్ల అప్పు చేసిన ఘనత ఆ పార్టీది అని అన్నారు. వడ్ల కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఫోన్ ట్యాప్ చేసి కుటుంబ వ్యక్తిగత విషయాలను కూడా బహిర్గతం చేసిన నీచపు సంస్కృతి వారిదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కల్వకుర్తి అభివృద్ధికి తనతో కలిసి రావాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్ కుమార్, యెన్నం భూపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు సంజీవ్ కుమార్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, మట్టవెంకటయ్యగౌడ్, జిల్లెల రాములు, న్యాయవాది మల్లేపల్లి జగన్, కౌన్సిలర్లు బాలు నాయక్, రవిందర్, చిన్న రాంరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జమ్ముల శ్రీకాంత్, దామోదర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పాలేపు కొండలు తదితరులు ఉన్నారు.

# ఏకరూప దుస్తుల పంపిణీలో ఏపియం నిర్లక్ష్యం



విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన ఏకరూప దుస్తులను స్టాక్ రూంలోనే వృథాగా ఉంచిన దృశ్యం

**మాగనూరు, నవంబరు 28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మహిళా సమైక్య విభాగంలో నేడు ఏపిఎం వనిత కుమారి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నటువంటి విద్యార్థులకు అందని ఏకరూప దుస్తుల పంపిణీ, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నటువంటి విద్యార్థులకు పుస్తకాలు మరియు ఏకరూప దుస్తులను అందించడానికి గాను కొన్ని వేల రూపాయలను ఖర్చు చేస్తున్నప్పటికీ ఈ యొక్క అంశంపై ఏకరూప దుస్తుల పంపిణీ 45 రోజుల గడువులోనే పాఠశాలలకు అందించాలని ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నప్పటికీ కూడా మహిళా సంఘం వారికి మాగనూరు మండలంలోని 3187 యూనిఫామ్స్ అందించమని అధికారికంగా వారికి సమాచారం ఉన్నప్పటికీ అందులో ఇప్పటివరకు కనీసం 50 కూడా దుస్తుల పంపిణీ జరగ కుండా ప్రభుత్వ అందిస్తున్నటువంటి దుస్తుల పంపిణీలను నిర్లక్ష్యం గా వహిస్తూ మహిళ సమస్యలోనే మూలకు వాటిని పారవేసి, ఈ రోజు డిపిఎం మాసన్న మహిళా సమైక్యకు చేరుకున్న సందర్భంలో ఇప్పటివరకు ఎంతవరకు దుస్తుల పంపిణీ జరిగిందన్న విషయాన్ని అడిగినప్పటికీ ఏపిఎం వనితకుమారి ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తూ మరియు సమాచారాన్ని అందించకుండా గదులలోనే మునిగిపోయినటువంటి దుస్తుల పంపిణీ చూపించ కుండా తాళంవేసి డిపి మాసన్న అడిగినప్పటికీ తాళం లేదు అంటూ మాట దాటవేస్తున్నప్పటికీ డిపియం మాసన్న తాలాన్ని పగల గొట్టండి అంటూ చెప్తే అప్పుడు గానీ ఆ యొక్క గది తాలాన్ని తెరవ లేదు అప్పటికి ఆ గదిలో దాదాపుగా 500 నుండి 1000 దుస్తుల వరకు చూసి డిపిఎం మాసన్న మాట్లాడుతూ ఇది తప్పకుండా ఇక్కడున్నటువంటి ఏపియం వనిత మరియు సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఈ విధంగా జరిగిందని తప్పకుండా ఈ విషయాన్ని పిడి దగ్గరకు సమాచారాన్ని పంపించి త్వరలోనే కఠినమైన చర్యలు తీసుకుంటా మని చెప్పడం జరిగింది కొత్తపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు 298మంది విద్యార్థులకు గాను 104 మంది విద్యార్థులకు మాత్రమే అందిందని మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలకు ఇంకా పూర్తిగా దుస్తులు పంపిణీ జరగలేదని చెప్పడం జరిగింది అద విధంగా ఇప్పటికీ మండల మహిళా సమైక్య అధ్యక్ష ఎన్నిక జరిగి దాదాపుగా రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఖాతాను పాత వారి పేరు మీదనే నడుస్తున్నటువంటి సమాచారం ఈ విషయంపై వివరణ కోరగా డిపిఎంమాసన్న ఎదురుగా సీసీలుఅందించినటువం టి సమాచారం మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏపిఎం వనిత కుమారిమాత్రమే ఈవిధమైనటువంటి నిర్ణయాలు తీసుకుం టుంది అని చెప్పడంతో డిపిఎం మాసన్న మాట్లాడుతూ ఇక్కడ సీసీలకు మరియు ఏపియం మధ్య కోఆర్డినేషన్ లేదని మరియు ఏపిఎం వనిత కుమారిని అడిగి తప్పకుండా మీరు రెండు రోజుల్లో ఈ యొక్క నూతన ఖాతాను తెరవాల్సిందిగా హెచ్చ రించడం జరిగింది అలాగే డిపిఎం మాసన్న ఏకరూప దుస్తుల పంపిణీ సంబంధించి వివరాలు ఏపిఎం అందించకపోవడం విడ్డూ రంగా మారిపోయింది సాయంత్రంలోగా నేను సమాచారాన్ని అంది స్తానని చెప్పిన డిపిఎం మాసన్న కూడా సమాచారం అందించక పోవడం పట్ల అసలు ఏం జరుగుతుందన్న విషయం ప్రజల కు సందిగ్ధంగా మారింది ఈ యొక్క కార్యక్రమంలో ఏపిఎం వనిత కుమారి డిపిఎం మాసన్న సీసీలు గంగాధర్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## మదనాపూర్ గురుకుల ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

◆ బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాచాల

**కొత్తకోట నవంబరు28 ప్రభాతవార్త:** మదనాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకర మని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం మదనాపూర్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ ప్రిన్సిపల్ విద్యార్థులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వనపర్తి కలెక్టరేట్ కార్యాల యంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి వినతి పత్రం అందజ చేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ మధ్యనే డైట్, కాస్మొటిక్ ఛార్జీలు 40 శాతం పెంచిం దన్నారు. ఓ వైపు ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుంటే కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇలాంటి సంఘట నలు జరుగుతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం చేయడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. గతంలో కూడా రెండు సార్లు ఇలాంటి ఘటనలే జరిగాయని, భవిష్యత్తులో ఇలాంటి సంఘ టనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ను కోరారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి విద్యార్థులకు మానసిక వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన కౌన్సెలింగ్ నిర్వహిం చడంతో పాటు వారంలో ఒకరోజు గురుకుల, సంక్షేమ వసతి గృహాల ను సందర్శించి అక్కడే నిద్రించే కార్యక్రమం చేపడితే ప్రయోజన కరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు వజగౌని వెంకటన్న గౌడ్, మహేందర్ నాయుడు, అంజన్న యాదవ్, గంధంనాగరాజు, శివనాయక్, రాఘవేందర్‌గౌడ్, గాలిగల్ల సాయి బాబ, శివశంకర్, గౌతమ్ శంకర్, శ్రీనివాస్ గౌడ్, నగేష్ పాల్గొన్నారు.

## ఓటు వజ్రాయుధం లాంటిది



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 28 ప్రభాతవార్త:** ప్రజాస్వా మ్యంలో ఓటు హక్కు కీలకమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి ఓటు హక్కును నమోదు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. గురు వారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు డిఆర్డిఏ అధికారులు నాగర్‌కర్నూల్ పట్టణ కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి శ్రీపురం చౌరస్తా వరకు రన్ నిర్వహించారు. అనంతరం నోడల్ అధికారి మాట్లాడుతూ 18 ఏళ్ల వయసుపై బడిన యువకులు ఓటు హక్కును పొందాలన్నారు. ప్రజలకు ఓటు అనేది ఒక వజ్రాయుధమన్నారు. ఓటు హక్కును రాజ్యాంగం మనకు కల్పించిన హక్కన్నారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ తహసిల్దార్ తబిత, ఎంపీడీవో కోటేశ్వరరావు, భాస్కర్ రెడ్డి డిఆర్డిఏ అధికారులు అరుణ దేవి సిబ్బంది పాల్గొన్నారు.

## యువతరం ఓట్లు.. ప్రగతికి మెట్లు

**కల్వకుర్తి, నవంబర్28, ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో గురువారం ఉదయం11 గంటలకు ఓటర్ల విశిష్టతపై ఎంపిడిఓ వెంకటరాములు, మండలవిద్యాశాఖాధికారి శంకర్ల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్‌కళాశాలవిద్యార్థులచే 2కె రన్ నిర్వహిస్తూ యువతరం ఓటర్లపైఅవగాహనా కార్యక్రమం నిర్వహించి మానవ హరం నిర్వహించారు. అదే విధంగా ఓటు హక్కుపై అవగాహన, ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఆదే విధంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాంరెడ్డి కళాశాల లెక్చరర్లు ,సిబ్బంది, ప్రాజెక్టు మేనేజర్ ఐకెపి వెంకటేష్, ఏపీఎంఐకెపి శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లింగంపల్లి భాగ్యలక్ష్మి కాటన్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం

### కాటన్ మిల్లును సందర్శించిన బిజెపి రాష్ట్ర నాయకులు నాగరావు నామాజీ

**నారాయణపేట టౌన్, నవంబరు 28 ప్రభాతవార్త:** కాటన్ మిల్లు లో భారీ అగ్ని ప్రమాదం జరిగి పత్తి అగ్నికి ఆహుతి అయ్యి భారీ నష్టం జరిగిన ఘటన గురువారం నారాయణపేట జిల్లాలో చోటు చేసుకుంది. అందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట మండలం లింగంపల్లి గ్రామ సమీపంలోని భాగ్య లక్ష్మి కాటన్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. వారం రోజులుగా రైతుల నుండి కొనుగోలు చేసిన పత్తిని ఒక దగ్గర నిల్వ చేశారు. అగ్ని ప్రమాదంలో ఇట్టకేలకు కాలిపోయింది. సుమా రుగా 8 వేల క్వింటాళ్ల పత్తి అగ్ని ప్రమాదానికి ఆహుతి అయినట్లు కాటన్‌మిల్ నిర్వాహకులు తెలియజేస్తున్నారు. కాగా పత్తిని అమ్మ కాళ్లకు తీసుకువచ్చిన రైతులకుఇలాంటి నష్టం జరగనట్లు సమాచా రం. విషయాన్ని గమనించిన కాటన్ మిల్లు నిర్వాహకులు అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని చేరుకుని ఎగిసిన మంటలను ఆర్పేందుకు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు నాగు రావు నామాజీతో బాటు కాటన్ మిల్‌ను సందర్శించి అగ్ని ప్రమాదంపై జరిగిన అంశాన్ని గురించి తెలుసుకున్నారు. షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం జరిగిందా లేక ఏ ఇతర కారణాలు ఉన్నాయా తెలియాల్సి ఉంది.



పత్తి దగ్ధమవుతున్న దృశ్యం

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**బిజినేపల్లి, నవంబరు 28 ప్రభాతవార్త:** నంది వడ్డెమాన్ గ్రామంలో ఆటో డ్రైవర్ వేముల కురుమయ్య గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మరణించడంతో అతని కుటుంబానికి శెట్టి రాజేష్, విష్ణువర్ధన్ రెడ్డి 5000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి అండగాఉంటామని భరోసా కల్పించారు. భవిష్యత్తులో సైతం కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బంగా రయ్య, ఆటో డ్రైవర్ వెంకటేష్, పంబ చెన్నయ్య, చిట్టిబాబు, వేముల కుర్మయ్య తదితరులు ఉన్నారు.

## 30న శనేశ్వర స్వామి వ్రతాలు

**బిజినేపల్లి, నవంబరు28 ప్రభాతవార్త:** నంది వడ్డేమాన్ గ్రామంలో శ్రీసార్ధసప్త జేష్ట మాత సమేత శనీశ్వర దేవాల యంలో ఈనెల 30న కార్తీక శనివారం మాస శివరాత్రి సంద ర్భంగా సామూహిక శనేశ్వర స్వామి వ్రతాలు, కార్తీక వనభోజ నాలు, శనీశ్వర స్వామికి సామూహిక తిలతైల అభిషేకాలు నిర్వ హిస్తున్నట్లు శనేశ్వర ఆలయచైర్మన్ వెల్దండ గోపాల్ రావు, ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి తెలి పారు. కార్తీక మాసం చివరి శనివారము చతుర్దశి అమావాస్య తిథి ఉండడంతో శని గ్రదోష నివారణకు శనేశ్వర వ్రతాలు చేయడంవిశేష ఫలితాన్నిస్తుందన్నారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## అక్రమ అరెస్టులు సరికాదు

**సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కె. కాశీనాథ్**

**నారాయణపేట టౌన్, నవంబరు 28 ప్రభాతవార్త :** నారాయ ణపేట జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం 4 గంటల నుండి సిపిఎం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయ కులను, ప్రజా సంఘాల జిల్లా నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగింది. సంబంధం లేకుండా అరెస్టు చేయడాన్ని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్య దర్శి కాశీనాథ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం నిత్యం ప్రజా క్షేత్రంలో ఉండి వారి సమస్యల పరిష్కారానికై అనునిత్యం ప్రయత్నిస్తున్న నాయకులను అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఇక్కడ ఎవరు ఎలాఆందోళనలు చేస్తున్నారో పోలీసు లు స్పష్టమైన రిపోర్టును సేకరించుకోవాలని పోలీసుల ఇంటలి జెన్స్ రిపోర్టు వైఫల్యానికి నాయకులను బాధ్యులను చేయడం సరికాదన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## చెరుకు తోట దగ్ధం

**మక్తల్, నవంబరు 28 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని అనుగొండ మాజీ సర్పంచ్ గడ్డం రమేష్ కు చెందిన చెరుకు తోట గురువారం సాయంత్రం దగ్ధమైంది. గ్రామ సమీపంలోని తమ వ్యవసాయ పొలంలో దాదాపు ఆరు ఎకరాల్లో చెరుకు పంట పూర్తిగా దగ్ధమైనట్లుఆయన తెలిపారు. కాగా ఈ ఘట నపై అయన అనుమానం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో విచా రణ జరిపి తనను ఆదుకోవాలని ఆయన కోరారు.

## వ్యాసరచన పోటిల్లో జిల్లా స్థాయికి ఎంపిక

**కొత్తకోట నవంబరు 28 ప్రభాతవార్త:** కొత్తకోట పట్టణ కేంద్రం లోని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో గురువారం మండల స్థాయిలో పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటిల్లో మండలంలోని వివిధ పాఠశాలల నుండి 24 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతితులుగా ఎంఈఓ జె కృష్ణయ్య పాల్గొని వ్యాసరచన పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పునరుత్పాదక శక్తి వనరు లు వినియోగించడం దేశ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ శక్తివనరులను ఉపయోగిస్తే కాలుష్యరాహిత వాతావరణంఏర్పడుతుందని భవిష్యతరాలు ఇలాంటి ఇబ్బం దులు లేకుండా జీవించగలుగుతాయని తెలిపారు. అనంతరం ఈ పోటీలో జెడ్‌పిహెచ్ఎస్ పాలెం తెలుగు మీడియం నుండి మొదటి స్థానంలో సి మంజుల, రెండవ స్థానంలో అప్పరాల ప్రభుత్వ పాఠశాల నుండిఎన్‌మహేశ్వరి, కొత్తకోట హై స్కూల్ నుండిఇంగ్లీష్ మీడియం మొదటి స్థానంలో విశ్వవికాస్, రెండవ స్థానంలో భారతి విద్యామందిర్ డి.తరుణ్‌లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కృష్ణయ్య తెలిపారు. ఈ విద్యా ర్థులు ఈనెల 30 తారీఖున జిల్లాలో నిర్వహించబడే జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలలో పాల్గొనాలని కోరారు. ఈ కార్య క్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ప్రవీణ్ రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెకుముఖి టాలెంట్ రాష్ట్రస్థాయి పోటిలకు కల్వరాళ్ల విద్యార్థుల ఎంపిక

**వీపనగండ్ల నవంబరు 28 ప్రభాతవార్త:** డిసెంబర్ 14,15,16 తేదీలలో ఆదిలాబాద్ లో జరుగు రాష్ట్రస్థాయి చెకుముచ సైన్స్ టాలెంట్ టెస్టుకు కల్వరల్లా విద్యార్థులు ఎంపిక అయినట్లు జడ్పీహెచ్ఎస్ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజవర్ధన ఆచారి తెలిపారు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ చెకు ముచ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించినట్లు గురువారం నాడు ఆయన తెలిపారు. అయితే జన విజ్ఞాన వేదిక ఆధ్వ ర్యంలో జిల్లా కేంద్రంలోఆంగ్ల మాధ్యమంలో టాలెంట్ టెస్టు లు నిర్వహించగా అందులో మొదటి జిల్లా స్థాయి పోటీలలో అభినవ్, శరత్‌యాదవ్, యశ్వంత్ పాల్గొన్నారు. అని ఆయన తెలిపారు వారు రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా జిల్లా స్థాయిలో మొదటి స్థానం పొందగా వారికి వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాక మహేష్ బహుమతులు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్ సందర్భంగా ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు నరేందర్ జిల్లా జనరల్ సెక్రెటరీ దేవుని ప్రవీణ్ కుమార్ పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఈపోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా వారికి గైడ్‌గా ఉన్న ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు అని ఆయనతెలిపారు. ఇందులో కల్వరాల పాఠశాల ఉపాధ్యాయులు గైడు, టీచర్లు శ్రీనివాసులు, బలరాముడు, శ్రీనివాస్‌రెడ్డి, బక్కన్న, జితేందర్‌గౌడ్, పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

## పరిశుభ్రమైన వాతావరణంలో ఉండాలి

### ఎంఈఓ చంద్రుడు

**వెల్దండ, నవంబరు 28 ప్రభాతవార్త:** పాఠశాలలో విద్యా ర్థులకు అందించే ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతతో అందించాలని ఎంఈఓ చంద్రుడు అన్నారు వెల్దండ మండల పరిధిలోని చొక్కనపల్లి, బర్కత్‌పల్లి, చెర్కూరు ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని రికార్డులను ఉపాధ్యాయుల విద్యా బోధన తరగతుల వారిగా విద్యార్థుల సామర్థ్యాలను మధ్యాహ్న భోజన అంశాల తీరును పరిశీలించి విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో వంట ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించి ఎంఈఓ మాట్లా డారు. పాఠశాలలోని విద్యార్థులకు మెను ప్రకారం భోజనం పెట్టాలని నాణ్యతలో రాజీ పడకుండా మెనూ కచ్చితంగా పాటించాల్సిందేనని అన్నారు కార్యక్రమంలో వెల్దండ కాంప్లెక్స్ జిహెచ్‌ఎం రవీందర్ ఉన్నారు

